


# కరపత్రం

SINCE 2014

శుక్రవారం జూలై 03, 2026 సంపుటి : 2 సంచిక : 261 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4



## బిఆర్ఎస్ గూండిగిరికి ప్రభుత్వం భయపడదు

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



2లో..

## సమాధానం చెప్పలేనప్పుడు సవాళ్లు ఎందుకు?

### ప్రభుత్వ తీరుపై మండిపడ్డ కెటిఆర్




# మూసీ సుందరీకరణ ప్రాజెక్టు మొదటి దశకు ఆమోదం

## రూ.7,345కోట్లతో మొదటి దశ పనులకు గ్రీన్ సిగ్నల్

- వీబీ జీరామ్‌జీ పథకాన్ని అమలు చేస్తూనే కోర్టులో సవాల్
- ఇక స్కూళ్లు, కాలేజీల్లో టీచర్లకు కూడా మధ్యాహ్న భోజనం
- సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో మొత్తం 6,278 పోస్టుల మంజూరు
- గిడ్డంగులు, నవోదయ విద్యాలయాలకు పలుచోట్ల భూ కేటాయింపులు
- తెలంగాణ కేబినేట్ కీలక నిర్ణయాలు

**హైదరాబాద్,జూలై2 :**
తెలంగాణ కేబినేట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. మూసీ సుందరీకరణ ప్రాజెక్టు మొదటి దశకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రూ.7,345కోట్లతో మొదటి దశ పనులు చేపట్టనున్నారు. టిమ్స్, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో 6,278 పోస్టుల మంజూరుకు క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన తెలంగాణ మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. రాష్ట్రంలో వీబీ జీరామ్‌జీ పథకాన్ని అమలు చేయాలని క్యాబినెట్ నిర్ణయించింది. దీనికి సంబంధించిన అభ్యంతరాలపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని నిర్ణయం తీసుకుంది.
కేబినేట్ వివరాలను మంత్రులు పొంగులేటి , సీతక్కలు వివరించారు. ఉపాధి హామీ పథకాన్ని ప్రజల అభిప్రాయాలకు విరుద్దంగా తొలగించారని మండిపడ్డారు. దీని స్థానంలో విబిజిరామ్ పథకం తేవడం దుర్మార్గమని అన్నారు. విధిలేని పరిస్థితిలో దీనిని ఆమోదిస్తూనే, దీనిపై న్యాయపోరాటం చేయాలని కేబినేట్ నిర్ణయించిందని మంత్రి పొంగులేటి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను సంప్రదించకుండా ఏకపక్షంగా అమల్లోకి తెచ్చిన 'వీబీ జీ రామ్ జీ' చట్టంపై రాష్ట్ర మంత్రివర్గం తీవ్ర నిరసన వ్యక్తం చేసింది.

మిగతాద్ది 2 లో

# రాష్ట్రంలో రాజకీయ ఉద్రిక్తత

- కాంగ్రెస్, బిఆర్ఎస్ సవాళ్ల పర్వం
- తెలంగాణ భవన్ వద్ద హరీష్ తదితరుల అరెస్ట
- గన్‌పార్క్ వద్ద చర్చకు సిద్దం అంటూ మంత్రుల బైఠాయింపు



**హైదరాబాద్,జూలై2 :**
రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి. సవాళ్లు, ప్రతిసవాళ్లతో పాలిటిక్స్ హీటెక్కాయి. కాంగ్రెస్ పార్టీ రెండున్నరేండ్ల చెత్త పాలనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. అవినీతి, అక్రమాలపై లెక్కలతో పక్కాగా వివరిస్తాననిస్పష్టం చేశారు. డేట్ అండ్ టైం ప్లేస్ ఏదైనా సరే.. 'వరంగల్ ప్రెస్‌క్లబ్‌లోనా? అశోక్‌నగర్‌లోనా? అసెంబ్లీలోనా? వేదిక ఏదైనా బీఆర్ఎస్ తరపున తాను చర్చకు వస్తా.. రాహుల్‌గాంధీ వస్తారో? ఇంకెవరొస్తారో తేల్చుకోండి. మీ పాలనా వైఫల్యాలను లెక్కలతో బయటపెట్టకపోతే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకొంటానని చాలెంజ్ చేశారు. కాగా,



కేటీఆర్ సవాల్‌కు మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించారు. తాను తెలంగాణ భవన్‌కు గురువారం 11 గంటలకు వస్తానని మంత్రి ప్రతి సవాల్ విసిరారు. మంత్రి చాలెంజ్‌ను స్వీకరించిన బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ భవన్‌లో మీ కోసం ప్రత్యేకంగా కుర్చీ రెడీగా ఉంది. మీదే ఆలస్యం దమ్ముంటే చర్చకు రావాలన్నారు. దీంతో ఒక్కసారిగా రాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి. అటు తెలంగాణ భవన్, ఇటు గాంధీ భవన్ వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. జూపల్లి వ్యాఖ్యల నేపథ్యంలో కేటీఆర్, హరీశ్ రావు బీఆర్ఎస్ భవన్‌కు వెళ్లేందుకు సిద్దమయ్యారు. జూపల్లి వస్తే కేంద్ర ప్రభుత్వ నివేదికలు, ఆర్‌బీఐ లెక్కలు, సాక్ష్యాలతో సహా వివరిస్తామని వారు తెలిపారు. కాగా, జూపల్లితో చర్చకు కేటీఆర్ అవసరం లేదని తాను సరిపోతానని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కావాలంటే కేటీఆర్ కూడా వస్తారన్నారు. ఏ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారు.

2లో..



### గురుకులాల టెండర్ల అవినీతిపై

# చర్చకు సిద్ధం

## ఎన్నికైన ప్రజాప్రతినిధులతోనే చర్చిస్తాం

- కెసిఆర్ లాగా కడప కాంట్రాక్టర్లకు టెండర్లు ఇవ్వలేదు
- బిఆర్ఎస్ విమర్శలపై మంత్రి పొన్నం ప్రతి విమర్శలు

**హైదరాబాద్,జూలై2 :**
గురుకులాల టెండర్లలో అవినీతిపై చర్చించేందుకు తాము సిద్ధమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. బిఆర్ఎస్ సవాల్‌తో మంత్రులు గన్‌పార్క్ వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా పొన్నం మీడియాతో మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో దేవాలయం లాంటి అసెంబ్లీలో హరీశ్‌రావు చర్చకు రావాలని సవాల్ చేశారు.

మిగతాద్ది 2 లో





2లో

## బోడుప్పల్‌లో భూపోరాటానికి దిగిన కవిత

### అడ్డుకుని అరెస్ట్ చేసిన పోలీసులు

**హైదరాబాద్,జూలై2 :**
తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవితను బోడుప్పల్‌లో పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని బోడుప్పల్‌లో భూ పోరాటానికి టీఆర్ఎస్ సిద్ధమైంది.

# మంత్రులకు చర్చించే దమ్ము ఉంది

- అందుకే ధైర్యంగా గన్‌పార్క్ వద్దకు వచ్చారు
- బిఆర్ఎస్ నేతలే చర్చకు రాలకుండా పారిపోయారు
- ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ విమర్శలు



2లో..

**హైదరాబాద్,జూలై2 :**
కాంగ్రెస్ మంత్రులకు దమ్ము, ధైర్యం ఉందని, అందుకే వారు బహిరంగ చర్చకు ముందుకు వచ్చారని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పేర్కొన్నారు. మంత్రులు పూర్తిగా, పారదర్శకంగా పనిచేస్తున్నారని తెలిపారు.

## ఎన్టీపీసి సోలార్ విద్యుత్ ప్రాజెక్ట్ పూర్తి

### వాణిజ్య ఉత్పత్తిలోకి 176మెగావాట్ల సోలార్ విద్యుత్

**కరీంనగర్,జులై 2 :**
రామగుండం ఎన్టీపీసీలోని బ్యాలెన్స్ రిజర్వాయర్‌లో 176మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్రాజెక్టు పూర్తిస్థాయి వాణిజ్య ఉత్పత్తి దశలోకి చేరుకుంది. తాజాగా మంగళవారం చివరి 41.6మెగావాట్ల యూనిట్ కమర్షియల్ ఆపరేషన్‌లోకి వచ్చింది.



2లో..

# బిఆర్ఎస్ చేసిన అప్పులపై చర్చకు సిద్దమే

- చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక పోతున్నాం
- ఇంత జరుగుతన్నా కెసిఆర్ ఎందుకు మాట్లాడరు
- మండిపడ్డ మంత్రి జూపల్లి కృష్ణారావు



**హైదరాబాద్,జూలై2 :**
బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పుల వివరాలపై చర్చకు సిద్ధంగా ఉన్నట్లు మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గత ప్రభుత్వం రూ.7.3 లక్షల కోట్ల అప్పులు చేసిందన్నారు. కేవలం కాళేశ్వరం ప్రాజెక్టు కోసం రూ.74వేల కోట్ల అప్పు చేసిందన్నారు. తాను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నా. తాము అప్పులు చేయలేదని కేసీఆర్ చెప్పాలి. నేను చెప్పింది అబద్ధమైతే రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నా. కార్పొరేషన్ పేరుతో అప్పు చేసి కాళేశ్వరం కట్టామని చెబుతున్నారు. అది నిజమా కాదా చెప్పాలన్నారు. ఇలా అప్పులు చేసి, ఎలా తీరుస్తారో ఎందుకు చెప్పలేదన్నారు. ఆ అప్పులను రైతుల నుంచి వసూలు చేస్తారా? ఒక్కో రైతు నుంచి రూ.20 లక్షలు వసూలు చేస్తారా?మేం చేసిన ఆరోపణలపై కేసీఆర్ ఎందుకు స్పందించడం లేదన్నారు. నా వద్ద ఉన్న రికార్డులు, కాగితాలు ఇస్తా.. చర్చకు రావాలి. మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ ఇంకా బుకాయిస్తున్నారు.

మిగతాద్ది 2 లో

# గంజాయి స్మగ్లర్ల కొత్త ఎత్తులు

- స్పీడ్ పోస్ట్ ద్వారా పార్సిళ్లలో గంజాయి
- హైదరాబాద్ పోలీసుల ఆపరేషన్‌లో గుర్తింపు
- వివరాలు వెల్లడించిన నగర పోలీస్ కమిషనర్ సజ్జన్నార్



**హైదరాబాద్,జూలై2 :**
దేశవ్యాప్తంగా స్పీడ్ పోస్ట్ ద్వారా గంజాయి సరఫరా చేస్తున్న ముఠాను అరెస్ట్ చేశామని హైదరాబాద్ సీపీ సజ్జనార్ తెలిపారు. రైళ్లు, విమానాల ద్వారా వచ్చిన స్పీడ్ పోస్ట్ పార్సిళ్లకు స్కానింగ్ లేకపోవడంతో సరఫరా సులభమైందన్నారు. దీంతో ఇక పోస్టల్ పార్సిళ్లకు తప్పనిసరి స్కానింగ్ అమలు చేయాలని కేంద్ర శాఖలకు లేఖ రాయనున్నట్లు తెలిపారు. ఎస్ఆర్ నగర్, గుడిమల్కాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పార్సిల్‌పై అనుమానం కలిగి దర్యాప్తు చేశామని.. హైదరాబాద్‌కు వచ్చిన 2 పార్సిల్స్ ఫ్లైట్‌లోనే వచ్చాయన్నారు. నగరంలోని అన్ని కొరియర్ సంస్థలకు ప్రతి పార్సిల్‌ను తప్పనిసరిగా స్కాన్ చేయాలని ఆదేశాలు జారీ చేస్తాన్నారు. అనుమానాస్పద పార్సిళ్లు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సీపీ సజ్జనార్ విజ్ఞప్తి చేశారు.గురువారం మీడియాతో మాట్లాడుతూ..

మిగతాద్ది 2 లో

# మంత్రులకు చర్చించే దమ్ము ఉంది

మొదటిపేజీ తరువాయి
గురువారం హైదరాబాద్ గన్‌పార్క్ వద్ద ఆయన మాట్లాడారు. తప్పు చేయలేదనే నమ్మకంతోనే ప్రజల ముందుకు వచ్చి మంత్రులు చర్చకు సిద్ధమయ్యారని చెప్పారు. అలాగే హరీశ్‌రావు అండ్ కో చర్చకు రావాలని కోరితే వారు తప్పించుకుంటున్నారని విమర్శించారు.
ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి విమర్శలనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. గురుకులాలపై వచ్చిన ఆరోపణలకు సమాధానం చెప్పేందుకు మంత్రులు ముందుకొచ్చారని దానం నాగేందర్ పేర్కొన్నారు. కాగా, గురుకులాల నిర్వహణ, అవినీతి ఆరోపణల అంశంపై రాజకీయ వేడి మరింత పెరిగింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మహ్మద్ అజారుద్దీన్ బహిరంగ చర్చకు సిద్ధమయ్యారు. బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావుతో పలు అంశాలపై చర్చించడానికి రెడీ అని చెప్పారు. అయితే, ఈరోజు కాంగ్రెస్ మంత్రులు మొదటగా అసెంబ్లీకి బయలుదేరారు. అనంతరం గన్‌పార్క్‌కు చేరుకుని తమ సన్నద్ధతను ప్రకటించారు. గురుకులాల వ్యవహారంలో తమ ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరిస్తోందని, అవినీతి ఆరోపణలపై ఎలాంటి చర్చకైనా సిద్ధమని మంత్రులు స్పష్టం చేశారు.

## గురుకులాల టెండర్ల అవినీతిపై
# చర్చకు సిద్ధం

మొదటిపేజీ తరువాయి
తాము ప్రెస్‌క్లబ్‌కు కూడా వస్తామని.. కానీ రాజ్యాంగంలో ఎన్నికైన వ్యక్తులు చర్చకు రావాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికైన ప్రజాప్రతినిధులు ఈరోజు 12 గంటల్లోగా గన్‌పార్క్ దగ్గరకు రావాలని అన్నారు. మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు వస్తే తాము ఎక్కడైనా చర్చకు వస్తామని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో లాగా కడప కాంట్రాక్టర్లకు తమ ప్రభుత్వం టెండర్లు ఇవ్వలేదని తేల్చిచెప్పారు. తాము పారదర్శకంగా గురుకులాల టెండర్లు జరగాలని చూశామని పేర్కొన్నారు. 'గురుకులాల టెండర్ కోసం ముందుకు వచ్చిన కాంట్రాక్టర్ మాకేమైనా చుట్టమా?. టెండర్లలో అసలు అవినీతి జరిగింది రూ.2 వేల కోట్లా..? రూ.5వేల కోట్లా..?. బీఆర్ఎస్ నేతలు ఏది పడితే అది మాట్లాడుతున్నారు. ఆధారాలతో రండి మేము చర్చకు సిద్ధం. మేము అవినీతి చేసినట్లు నిరూపిస్తే.. ముగ్గురు మంత్రులం గన్‌పార్క్ దగ్గర ముక్కు నేలకు రాసి రాజీనామా చేస్తాం. మేము పిరికివాళ్లం కాదు. ఎవరితో పడితే వారితో చర్చకు రాము. మాజీ సీఎం కేసీఆర్ గులాబీ పార్టీ నేతలను అదుపులో పెట్టుకోవాలి. లేదంటే కేసీఆర్‌కు చెడ్డపేరు వస్తుంది. బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఏ విషయమైనా మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా మాట్లాడాలి. ఆయన అవినీతి చేసి ఉండొచ్చు.. ఆర్ఎస్పీకి మేం సమాధానం చెప్పం. తమ జోలికి వచ్చి ప్రవీణ్ ఇబ్బంది పడొద్దని మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు.

## ఎన్టీపీసి సోలార్ విద్యుత్ ప్రాజెక్ట్ పూర్తి

మొదటిపేజీ తరువాయి
ఈ ప్రాజెక్టులో 56మెగా వాట్ల ఫ్లోటింగ్ సోలార్, 120మెగావాట్ల సర్ఫేస్‌సోలార్ ప్రాజెక్టును నిర్మించారు. ఎన్టీపీసీ రిజర్వాయర్‌లో ఇంతకుముందు 100మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టును నిర్మించారు. మూడేళ్లుగా ఈ ప్రాజెక్టు పూర్తి స్థాయి సామర్థ్యంతో పనిచేస్తుంది. ఈక్రమంలో ఈప్రాజెక్టు విస్తరణను ఎన్టీపీసీ యాజ మాన్యం చేపట్టింది. 176మెగావాట్ల కంబైన్డ్ సోలార్ ప్రాజెక్టుకు సంబంధించి తొలిదశ వంద మెగావాట్లు గత మే 2న, రెండో దశ 34.4 మెగావాట్లు మే29న వాణిజ్య ఉత్పత్తిని ప్రారంభించాయి. తాజాగా మిగిలిన 41.6 మెగావాట్లు మంగళవారం నుంచి అందు బాటులోకి వచ్చింది. దీంతో దేశవ్యాప్తంగా ఎన్టీపీసీ సంస్థ మొత్తం స్థాపిత విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 90,899మెగావాట్లకు, వాణిజ్య విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 89,819 మెగావాట్లకు పెరిగింది. రామగుండం ఎన్టీపీసీ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో నెలకొ ల్పిన 156 మెగావాట్ల ఎ÷-లోటింగ్ సౌర విద్యుత్‌కేంద్రం దక్షిణాదిలోనే అతిపెద్దదిగా గుర్తింపు పొందింది.

## గంజాయి స్మగ్లర్ల కొత్త ఎత్తులు

మొదటిపేజీ తరువాయి
అధికారులు, గుడిమల్కాపూర్ పోలీసులు జాయింట్ ఆపరేషన్ నిర్వహించి నిందితుల్ని అరెస్ట్ చేశారన్నారు. గంజాయిను స్పీడ్ పోస్ట్ ద్వారా డోర్ డెలివరీ చేస్తున్నారని.. జార్ఖండ్‌కు చెందిన సత్యం మిశ్రాను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. ఇంటర్ చదివిన సత్యం మిశ్రా పెయింట్ పని చేసి మానేశాడని.. ఆ తర్వాత లారీ డ్రైవర్‌గా పనిచేశాడన్నారు. 2018లో గంజాయికి అలవాటు పడ్డ మిశ్రా.. రాహుల్ జై, సచిన్
మిశ్రా, సంతోష్‌తో సిండికేట్‌గా ఏర్పడి.. సొంత ఊరిలోనే గంజాయి పంట వేశారని తెలిపారు. ఊరిలో చాలా మందితో గంజాయి పంట పండించి కొనుగోలు చేసి కస్టమర్లకు సరఫరా చేస్తున్నారని చెప్పారు. మరో నలుగురు నిందితులు పరారీలో ఉన్నారన్నారు. స్పీడ్ పోస్ట్, కొరియర్ సేవల ద్వారా 21 రాష్ట్రాలకు గంజాయి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్, ముంబై, చెన్నై, ఢిల్లీ, బెంగళూరు సహా పలు నగరాలకు గంజాయి సరఫరా చేస్తున్నారని సజ్జనార్ తెలిపారు. పార్సిళ్లలో మందులు ఉన్నట్లు తప్పుడు డిక్లరేషన్ ఇచ్చి పోస్టల్ అధికారులను మోసగిస్తున్నారని.. ఇస్రీ బజార్, ఫుస్రో పోస్టాఫీసుల నుంచి స్పీడ్ పోస్ట్ ద్వారా పార్సిళ్లు బుక్ చేసినట్లు గుర్తించామన్నారు. వాట్సాప్, సోషల్ మీడియా ద్వారా ఆర్డర్లు తీసుకుని ఙఖఎ ద్వారా నగదు లావాదేవీలు జరిగేవన్నారు. రోజుకు 80 -100 ఆర్డర్లు వస్తుండగా.. అందులో 8 నుంచి 10 వరకు స్పీడ్ పోస్ట్ పార్సిళ్ల ద్వారా గంజాయి పంపిణీ చేస్తున్నారన్నారు. ఒక్కో పార్సిల్‌లో 50 - 250 గ్రాముల గంజాయి ఉంచుతూ డెలివరీ చేస్తున్నారని.. ఒక్కో ప్యాకెట్ రూ.1,500 నుంచి రూ.8,000 వరకూ విక్రయిస్తున్నట్లు తెలిపారు. రోజుకు సుమారు రూ.1 లక్ష ఆదాయం లభించగా.. నెలకు రూ.30 లక్షల నుంచి రూ.35 లక్షలు, ఏడాదికి రూ.4 కోట్ల నుంచి రూ.5 కోట్ల టర్నోవర్ ఉందన్నారు. సరఫరాదారులు, కస్టమర్స్ మధ్య కోడ్స్ ద్వారా ఆన్‌లైన్ బుకింగ్ జరుగుతుందని తెలిపారు. వాట్సాప్‌లో వివిధ కోడ్స్ ద్వారా కస్టమర్స్ గంజాయి ఆర్డర్ చేస్తున్నారని అన్నారు. వచ్చిన డబ్బుతో నిందితులు బంగారం, లగ్జరీ వాహనాలు కొనుగోలు చేశారని సీపీ వెల్లడించారు. నిందితులు పలు బ్యాంక్ ఖాతాలు, ఐడీలతో మనీలాండరింగ్ చేసినట్లు గుర్తించామన్నారు.

## బోడుప్పల్‌లో భూపోరాటానికి దిగిన కవిత

మొదటిపేజీ తరువాయి
ఇందులో భాగంగా బోడుప్పల్ చేరుకుని భూ పోరాటం చేస్తున్న కవితను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులతో టీఆర్ఎస్ కార్యకర్తలు వాగ్వాదానికి దిగారు. తోపులాట చోటు చేసుకోవడంతో కవితతో పాటు టీఆర్ఎస్ శ్రేణులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అక్కడి నుంచి బొల్లారం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఉప్పల్‌లో ఈరోజు తెలంగాణ ఉద్యమకారులు, మహిళల రక్తం చిందిందని కవిత అన్నారు. బొల్లారం పీఎస్ వద్ద టీఆర్ఎస్ చీఫ్ మాట్లాడుతూ.. మహిళలు, తెలంగాణ ఉద్యమకారులపై పోలీసులు విచక్షణారహితంగా లాఠీఛార్జ్ చేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను మాత్రమే అడిగాం తప్ప వేరే డిమాండ్లు ఏమీ అడగలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి నేటి నుంచి కౌంట్‌డౌన్ స్టార్ట్ అయ్యిందన్నారు. ఉద్యమకారులకు వాళ్లు ఇస్తామన్న 250 గజాల స్థలం ఇవ్వాలని మాత్రమే అడిగామని తెలిపారు. కచ్చితంగా ఉద్యమకారులకు ఇస్తామన్న హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అడిగితే ఉద్యమకారులపై లాఠీఛార్జ్ చేసి రక్తం చిందేలా కొట్టడం అన్యాయమన్నారు. ఉద్యమకారులకు ఇస్తామన్న హామీలను ఈ ప్రభుత్వానికి రోజూ గుర్తు చేస్తూనే ఉంటామని కవిత స్పష్టం చేశారు.

# మూసీ సుందరీకరణ ప్రాజెక్టు మొదటి దశకు ఆమోదం

మొదటిపేజీ తరువాయి
ఈ కొత్త చట్టం వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై అదనపు ఆర్థిక భారం పడుతుందని, ఇది ఫెడరల్ , రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలోని కేబినెట్ సబ్ కమిటీ చేసిన సిఫారసులపై చర్చించారు. ఉపాధి హామీ పథకంలో ఎలాంటి మార్పులు చేయవద్దని గత జనవరిలోనే అసెంబ్లీలో తీర్మానం చేసిన విషయాన్ని గుర్తు చేస్తూ, మరోసారి కేంద్రానికి నిరసన తెలపాలని నిర్ణయించారు. అయితే, ఇతర రాష్ట్రాలన్నీ దీనికి ఆమోదం తెలపడం, ఉపాధి హామీ కూలీలకు పని కల్పించాలనే ఉద్దేశంతో గత్యంతరం లేని పరిస్థితిలో ఈ చట్టాన్ని జులై 1 నుంచి రాష్ట్రంలో అమలు చేసేందుకు నోటిఫికేషన్ జారీకి కేబినెట్ ఆమోదం తెలిపింది. కానీ, ఈ నిబంధనలపై సుప్రంకోర్టులో న్యాయపోరాటం చేయాలని, పార్లమెంట్‌లోనూ కేంద్రాన్ని నిలదీయాలని మంత్రివర్గం నిర్ణయించింది.రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు అందించే అల్పాహారం, పాలు , మధ్యాహ్న భోజనాన్ని ఇకపై వారితో పాటు ఉపాధ్యాయులు, లెక్చరర్లు, ఇతర సిబ్బందికి కూడా అందించాలని కేబినెట్ చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. పిల్లలకు నాణ్యమైన పోషకాహారం అందించే సంకల్పంతో పాటు, భోజన వితరణలో జవాబుదారీతనం పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. దీనివల్ల రాష్ట్రంలో దాదాపు లక్షన్నర మంది ఉపాధ్యాయులు, లెక్చరర్లు, పాఠశాల సిబ్బందికి ప్రయోజనం చేకూరనుంది.కొత్తగా అందుబాటులోకి వస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో భారీ ఎత్తున నియామకాలు చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. సనత్ నగర్, ఎల్.బి.నగర్, అల్వాల్ టిమ్స్ ఆసుపత్రులతో పాటు వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వీలుగా మొత్తం 6,278 డాక్టర్లు, వైద్య సిబ్బంది పోస్టుల మంజూరుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందులో 1,494 రెగ్యులర్
పోస్టులు, 549 కాంట్రాక్ట్ పోస్టులు, 4,235 ఔట్ సోర్సింగ్ పోస్టులు ఉన్నాయి. ఈ ఆసుపత్రులను నిమ్స్ తరహాలో అభివృద్ధి చేయాలని, ఇక్కడ అందించే వైద్య సేవలకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి నిధులు కూడా ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్‌లో భాగంగా ఫేజ్-ఎ పనులకు మంత్రివర్గం పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. తొలి దశలో హిమాయత్ సాగర్ నుంచి ఈసా, ఉస్మాన్ సాగర్ నుంచి మూసా ప్రవాహాలు ప్రారంభమయ్యే చోటు నుంచి బాపూఘాట్ వరకు 21 కిలోమీటర్ల పొడవునా అభివృద్ధి పనుల కోసం రూ. 7,345.12 కోట్ల కేటాయింపునకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు పనులు , నిర్వహణ కోసం నూతనంగా 147 పోస్టుల సృష్టికి, అలాగే ఇతర శాఖల నుంచి అవసరమైన సిబ్బందిని డిప్యూటేషన్‌పై తీసుకునేందుకు అంగీకారం తెలిపారు. నిత్యావసర వస్తువుల గోదాముల నిర్మాణానికి గాను తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థకు మార్కెట్ రేటు ప్రకారం భూములను కేటాయించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా వరంగల్ జిల్లా నెక్కొండ మండలం బొల్లికుంట గ్రామంలో 50 ఎకరాలు, రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం కర్కాలపహాడ్ గ్రామంలో 10 ఎకరాల భూమిని కేటాయించనున్నారు. రాష్ట్రంలో విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వ విద్యా సంస్థలకు స్థలాలను కేటాయిస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటు కోసం మహబూబ్‌నగర్ జిల్లా పెద్దాయిపల్లి గ్రామంలో 20.18 ఎకరాలు, సూర్యాపేట జిల్లా కోదాడలో 19.12 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించారు. అలాగే, జగిత్యాల జిల్లా చల్‌గల్ గ్రామంలో కొత్తగా కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు 5 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించాలని మంత్రివర్గం తీర్మానించింది.
గోదాములు, విద్యాలయాలు, సంస్థల నిర్మాణం కోసం స్థలాలు కేటాయించాలని నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులతో పాటు 1.50 లక్షల మంది ఉపాధ్యాయులు, లెక్చరర్లు, సిబ్బందికి కూడా అల్పాహారంతో పాటు మధ్యాహ్న భోజనం అందించాలని మంత్రివర్గం నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ఉపాధ్యాయ సంఘాల నుంచి, సిబ్బంది నుంచి ప్రభుత్వానికి అందిన విజ్ఞప్తులను పరిశీలించిన ముఖ్యమంత్రి మరియు మంత్రివర్గం దీనిపై సానుకూలంగా స్పందించింది. ఉపాధ్యాయులు మరియు స్కూల్ సిబ్బంది సమయపాలన పాటించడంతో పాటు, ఒత్తిడి లేకుండా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఈ నిర్ణయం ఎంతో దోహదపడుతుందని క్యాబినెట్ అభిప్రాయపడింది. తాజాగా జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఈ ప్రతిపాదనకు అధికారికంగా ఆమోద ముద్ర వేశారు. విద్యార్థులతో పాటు ఒకే పంక్తిలో ఉపాధ్యాయులు కూడా భోజనం చేయడం వల్ల పాఠశాలల్లో సమానత్వం పెంపొందడమే కాకుండా, భోజనం నాణ్యతను నిరంతరం పర్యవేక్షించడానికి వీలవుతుందని విద్యాశాఖ అధికారులు భావిస్తున్నారు. ప్రభుత్వ తీసుకున్న ఈ వినూత్న నిర్ణయంపై ఉపాధ్యాయ లోకం హర్షం వ్యక్తం చేస్తోంది.

# రాష్ట్రంలో రాజకీయ ఉద్రిక్తత

మొదటిపేజీ తరువాయి
ఎన్ని నెరవేర్చారో చర్చకు బరాబర్ సిద్ధమేనన్నారు. కాంగ్రెస్ అప్పుల బాగోతాన్ని లెక్కలతో తిప్పికొడుతామన్నారు. సవాళ్లు, ప్రతి సవాళ్ల నేపథ్యంలో తెలంగాణ భవన్‌కు బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలి వచ్చారు. ఇదిలావుంటే గురుకులాల్లో టెండర్లలో అవినీతి ఆరోపణలపై చర్చల్లో ట్విస్టు చోటు చేసుకుంది. కేటీఆర్, హరీశ్ రావు గన్‌పార్క్‌కు రావాలని మంత్రులు సవాల్ విసిరారు. ఈ నేపథ్యంలో గురుకులాల్లో అవినీతిపై చర్చకు హరీశ్ రావు సిద్ధమయ్యారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌తో కలిసి గన్‌పార్క్ బయలు దేరారు. గురుకులాలపై చర్చకు మేము ప్రెస్‌క్లబ్ రమ్మంటే మంత్రులు గన్‌పార్క్ రమ్మన్నారు. మాకు ఎలాంటి భేషజాలు లేవు. మీరు రమ్మన్నారు మేము వస్తున్నామని తెలిపారు. చర్చకు ఎక్కడికైనా మేము సిద్ధమని పేర్కొన్నారు. ఎలాంటి గొడవలు వద్దు కూర్చొని మాట్లాడుకుందామన్నారు. డ్రగ్స్ సరఫరా చేసే వారికి టెండర్లు ఇచ్చారని ఆరోపించారు. ఒకవేళ మంత్రి జూపల్లి తెలంగాణ భవన్‌కు వెళ్తే..కేటీఆర్ చర్చించేందుకు రెడీగా ఉన్నారని పేర్కొన్నారు.కాగా, గన్‌పార్క్‌కు బయలు దేరిన హరీశ్ రావును పోలీసులు అడ్డుకోవడంతో తెలంగాణ భవన్ వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. ముగ్గురు మంత్రులు రమ్మంటేనే మేము వెళ్తున్నాం. ఎందుకు ఆపుతున్నారని పోలీసులను ప్రశ్నించారు. కావాలంటే మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఫోన్ చేయాలని పోలీసులకు సూచించారు. ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకొని చర్చలను అడ్డుకుంటుందని హరీశ్ రావు మండిపడ్డారు.
మాజీ మంత్రి హరీశ్ రావు తెలంగాణ భవన్ నుంచి గన్‌పార్క్‌కు బయలుదేరగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, బీఆర్ఎస్ కార్యకర్తలకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. కారు దిగి పాదయాత్రగా వెళ్లేందుకు హరీశ్ రావు యత్నించారు. ఈ క్రమంలో అక్కడ జరిగిన తోపులాటలో ఆయన కిందపడిపోయారు. ఆ వెంటనే మాజీ మంత్రిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హరీశ్‌తో పాటు మాజీ మంత్రులు, బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేశారు. దీంతో తెలంగాణ భవన్ వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలీసులను అడ్డుపెట్టుకుని ప్రభుత్వం పారిపోయిందంటూ దుయ్యబట్టారు. అవినీతి జరిగింది కాబట్టే భయపడుతున్నారన్నారు. తాము చేసిన ఆరోపణలను ఆధారాలతో నిరూపిస్తామని హరీశ్ రావు స్పష్టం చేశారు. గురుకులాల టెండర్లలో అవినీతిపై చర్చించేందుకు మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, అజారుద్దీన్ సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా గన్‌పార్క్‌కు ముగ్గురు మంత్రులూ చేరుకుని.. అమరవీరుల స్థూపం దగ్గర కూర్చున్నారు. మంత్రులకు మద్దతుగా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ గన్‌పార్క్‌కు వచ్చారు. తెలంగాణ మంత్రులు, మాజీ మంత్రుల మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్ల నేపథ్యంలో గన్‌పార్క్ దగ్గర భారీగా పోలీసులు మోహరించారు. అటు సోమాజీగూడ ప్రెస్‌క్లబ్, తెలంగాణ భవన్ దగ్గర కూడా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## బిఆర్ఎస్ చేసిన అప్పులపై చర్చకు సిద్దమే

మొదటిపేజీ తరువాయి
బీఆర్ఎస్ చేసిన అప్పులను కేసీఆర్ స్వయంగా మీడియాకు చెప్పాలి. గత ప్రభుత్వం చేసిన అప్పులకు నెలకు రూ.6వేల కోట్ల వడ్డీ కడుతున్నామని జూపల్లి అన్నారు. మరోవైపు అప్పులపై చర్చించేందుకు తెలంగాణ భవన్‌కు వస్తానన్న మంత్రి జూపల్లి ఎందుకు రాలేదని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. ఆయన కోసం కేటీఆర్ వేచి చూస్తున్నారని అన్నారు. చర్చకు సవాల్ విసిరిన మంత్రులు తోక ముడిచి పారిపోయారని విమర్శించారు.

## సిఎంతో గిరిజన ఎమ్మెల్యేల భేటీ
## సీతక్క నాయకత్వంలో పలు అంశాలపై చర్చ

- ఏజెన్సీలో అదనగంగా 2వేల ఇందిరమ్మ ఇళ్లకు వినతి

సచివాలయం లో మంత్రి సీతక్క నేతృత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని ఆదివాసి ,గిరిజన శాసన సభ్యులు కలిశారున. పలు అంశాలపైన సీఎం కి వినతి పత్రాలు అందించారు.ఏజెన్సీ ప్రాంతంలోని నియోజకవర్గాల్లో అదనం గా 2 వేల ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని కోరారు.పోడు భూములకు పట్టాలు ఇవ్వడంతో పాటు ఇందిర గిరి జల వికాసం పథకం అమలు చేయాలని అన్నారు.గిరిజన ఆశ్రమ పాఠశాలలను ఇంటర్ వరకు అప్గ్రేడ్ చేయాలన్నారు. అలాగే ఐటీడీఏ లను మరింత బలోపేతం చేయాలన్నారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో అశ్వరావుపేట ఎంఎల్ ఏ జారే ఆదినారాయణ,పినపాక ఎంఎల్ ఏ పాయం వెంకటేశ్వర్లు,ఇల్లందు ఎంఎల్ ఏ కోరం కనకయ్య,భద్రాచలం ఎంఎల్ ఏ తెల్లం వెంకట్ రావు,ఖానాపూర్ ఎంఎల్ ఏ వెడ్మ బొజ్జు ఉన్నారు. సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి,అడ్లూరి లక్ష్మణ్,అజారుద్దీన్ కూడా ఉన్నారు.

## యాదగిరిగుట్ట ట్రస్ట్ బోర్డు విషయంలో కినుక
## కేబినేట్ భేటీకి కొండా సురేఖ గైర్హాజర్

తెలంగాణ రాష్ట్ర కేబినెట్ సమావేశానికి రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ గైర్హాజరు కావడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ముఖ్యమంత్రి అధ్యక్షతన గురువారం జరిగిన మంత్రిమండలి సమావేశానికి ఆమె రాకపోవడంపై సచివాలయ వర్గాలతో పాటు రాజకీయంగానూ పలు ఊహాగానాలు వ్యక్తమవుతు న్నాయి. సురేఖ తన విదేశీ పర్యటన ముగించుకుని రాష్ట్రానికి తిరిగి వచ్చినప్పటికీ, గురువారం జరిగిన కేబినెట్ భేటీకి రాకపోవడం వెనుక బలమైన కారణాలే ఉండి ఉంటాయని అంతా భావిస్తున్నారు.ప్రధానంగా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ బోర్డు ఏర్పాటు ప్రక్రియకు సంబంధించిన వ్యవహారమే మంత్రి కొండా సురేఖ అసంతృప్తికి కారణమనే ప్రచారం జోరుగా సాగుతోంది. తన శాఖకు సంబంధించిన అత్యంత కీలకమైన ఈ బోర్డు ఏర్పాటు విషయంలో దేవాదాయ శాఖ మంత్రిగా ఉన్న తన అభిప్రాయాలను పూర్తిగా పరిగణనలోకి తీసుకోలేదనే భావనతో ఆమె ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయంలో తీవ్ర అలక పూనిన కారణంగానే కొండా సురేఖ ఉద్దేశపూర్వకంగానే ఇవాల్టి కేబినెట్ సమావేశానికి దూరంగా ఉన్నారని సచివాలయ వర్గాల్లో గట్టిగా చర్చ నడుస్తోంది.

## బిఆర్ఎస్ గూండిగిరికి ప్రభుత్వం భయపడదు

మొదటిపేజీ తరువాయి
బీఆర్ఎస్ గూండాగిరీకి కాంగ్రెస్ ప్రభుత్వం భయపడదని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అవినీతిని అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్ బయటపెట్టారని చెప్పారు. అధికారంలోకి వస్తామనే భ్రమతో బీఆర్ఎస్ నేతలు తమపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ తప్పులను కాంగ్రెస్ ప్రభుత్వంపై మోపే ప్రయత్నం చేస్తున్నారు. టెండర్ విలువ కంటే ఎక్కువ అవినీతి ఎలా జరుగుతుంది? ఇలాగే ప్రవర్తిస్తే బీఆర్ఎస్‌కు ప్రతిపక్ష హోదా కూడా దక్కదు. ఆ పార్టీ సవాల్‌ను స్వీకరించి మంత్రులు చర్చలకు వెళ్లారు. బీఆర్ఎస్ నేతలే రాకుండా పారిపోయారు. అసెంబ్లీలో కూడా దీనిపై చర్చకు సిద్ధమే'అని పొంగులేటి అన్నారు.

## సమాధానం చెప్పలేనప్పుడు సవాళ్లు ఎందుకు?

మొదటిపేజీ తరువాయి
అసత్యాలతో ప్రజలను మభ్యే పెట్టే కార్యక్రమం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి రామారావు విమర్శించారు. ఈ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ప్రతిపక్షాలకు సమాధానం ఇచ్చే తెగువ కాంగ్రెస్ సర్కార్‌కి లేదని ఎద్దేవా చేశారు. గతంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా సవాల్ చేశారని.. ప్రెస్‌క్లబ్‌కి వెళ్తే ఎందుకు రాలేదని ప్రశ్నించారు. అప్పుల విషయంలో
దమ్ముంటే రావాలని సీఎం సవాల్ చేశారని తెలిపారు. పలు విషయాలపై చర్చించడానికి తాము సిద్ధమని రేవంత్‌రెడ్డికి చెప్పామని.. ఎక్కడైనా చర్చకు సిద్ధమేనని కేటీఆర్ స్పష్టం చేశారు. సవాల్ విరిసిన ముఖ్యమంత్రి పారిపోయారని సెటైర్లు గుప్పించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మధ్యలో సవాల్ విసిరారని.. సీఎం పంపితే జూపల్లి వస్తున్నారని తాము అనుకున్నామని.. కానీ పనికి మాలిన డైలాగ్‌లను జూపల్లి కొడుతున్నారని వ్యగ్యంగా అన్నారు. సవాల్ విసిరి మంత్రులు పారిపోతున్నారంటేనే.. ఈ ప్రభుత్వ అసమర్థత ఏంటో తెలిసిందని ఎద్దేవా చేశారు. మాజీ మంత్రి హరీశ్‌రావు చర్చకు బయల్దేరగానే ఈ ప్రభుత్వం ఎందుకు అరెస్ట్ చేయించిందని ప్రశ్నించారు. గన్‌పార్కు రమ్మన్నారని.. వెళ్తుంటే అరెస్ట్ చేశారని మండిపడ్డారు. చేతకాని వాళ్లు ఎందుకు సవాల్ విసరాలని నిలదీశారు. అసెంబ్లీలో తనకు గంట సమయం ఇవ్వాలని మాజీ మంత్రి కేటీఆర్ కోరారు.

## భట్టితో సిఎస్ మర్యాదపూర్వక భేటీ

రాష్ట్ర నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు గురువారం మధ్యాహ్నం తెలంగాణ సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో భేటీ అయ్యారు. సీఎస్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం డిప్యూటీ సీఎంను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇరువురు క్షేమసమాచారాలు చర్చించారు. సిఎస్‌గా నియమితులయినందుకు జాజును భట్టి అభినందించారు.

## అడ్మిషన్ దరఖాస్తుతో ఐదు ధృవపత్రాల జిరాక్స్ ప్రతులు తప్పనిసరి

**కరపత్రం ప్రతినిది వరంగల్ జూలై 2**
వరంగల్: టి.ఎం.ఆర్.ఎస్.ఉ జూనియర్ కళాశాల,వరంగల్ బాయ్స్--1,జక్కలొడ్డి కళాశాలలో అడ్మిషన్ కోసం దరఖాస్తు చేసుకునే విద్యార్థులు దరఖాస్తుతో పాటు నిర్దేశించిన ధృవపత్రాల జిరాక్స్ ప్రతులను తప్పనిసరిగా జతపరచాలని కళాశాల ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు.దరఖాస్తుతో పాటు కుల ధృవీకరణ పత్రం,చదువు ధృవీకరణ పత్రం,ఆదాయ ధృవీకరణ పత్రం,విద్యార్థి ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతి,తల్లిదండ్రుల ఆధార్ కార్డుల జిరాక్స్ ప్రతులను సమర్పించాలని సూచించారు.అవసరమైన ధృవపత్రాలు లేకుండా సమర్పించిన దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోబోమని,విద్యార్థులు ముందుగానే అన్ని పత్రాలను సిద్ధం చేసుకుని దరఖాస్తు సమర్పించాలని ప్రిన్సిపాల్ కోరారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన నాగుర్ల వెంకటేశ్వర్లు

- అక్షిత--రజనీకాంత్ వివాహ వేడుకకు హాజరై శుభాకాంక్షలు తెలిపిన మాజీ చైర్మన్



**కరపత్రం ప్రతినిది నడికూడ, జూలై 2**
హనుమకొండ జిల్లా నడికూడ గ్రామంలో జరిగిన అక్షిత--రజనీకాంత్ వివాహ వేడుక ఆత్మీయ వాతావరణంలో ఘనంగా జరిగింది. నడికూడ గ్రామానికి చెందిన శ్రీమతి--శ్రీ రావుల అనిత, కిషన్ దంపతుల కుమార్తె అక్షిత వివాహం రజనీకాంత్‌తో నడికూడలోని మారుతి గార్డెన్స్‌లో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషుల సమక్షంలో వైభవంగా నిర్వహించారు.ఈ వివాహ మహోత్సవానికి తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దాంపత్య జీవితం పరస్పర అవగాహన, ప్రేమ, అనురాగాలతో చిరకాలం సంతోషంగా కొనసాగాలని ఆకాంక్షించారు. నూతన దంపతులు ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు, సుఖసంతోషాలతో నిండిన జీవితాన్ని గడపాలని హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వధూవరులతో కలిసి జ్ఞాపక చిత్రాలు దిగిన నాగుర్ల వెంకటేశ్వర్లు, ఇరు కుటుంబ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో లోకటి నగేష్, భాస్కర్, రవి, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు, బంధుమిత్రులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన వధూవరులకు ఆశీస్సులు అందించారు. కుటుంబ సభ్యుల ఆనందోత్సాహాల మధ్య వివాహ వేడుక అత్యంత వైభవంగా, ఆత్మీయంగా జరిగింది.

## వరంగల్ పోలీస్ కమిషనర్‌ను కలిసిన జిల్లా కలెక్టర్ డా.సత్య శారద

**కరపత్రం ప్రతినిది వరంగల్,జూలై 2**
వరంగల్ జిల్లా కలెక్టర్ డా.సత్య శారద గురువారం వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత,ఐపీఎస్‌ను కమిషనరేట్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్‌కు పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సమావేశంలో జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ,ప్రజా సమస్యల సత్వర పరిష్కారం,ప్రభుత్వ సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాల సమర్థవంతమైన అమలుపై ఇరువురు అధికారులు విస్తృతంగా చర్చించారు.ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు పోలీసు,రెవెన్యూ శాఖల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు.అలాగే రానున్న పండుగలు,ప్రత్యేక ప్రభుత్వ కార్యక్రమాలను ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించేందుకు చేపట్టాల్సిన ముందస్తు భద్రతా చర్యలు,ట్రాఫిక్ నిర్వహణ,శాంతిభద్రతల పరిరక్షణ వంటి అంశాలపై పరస్పరం అభిప్రాయాలు పంచుకున్నారు.ప్రజల సమస్యల పరిష్కారంలో పరస్పర సహకారంతో సమన్వయంగా పనిచేస్తూ జిల్లాలో సుస్థిర పరిపాలన అందించేందుకు కలిసి ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ డా.సత్య శారద,పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత పేర్కొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి..

- లేకుంటే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం
- పాలమూరు యూనివర్సిటీలో బీసీ విద్యార్థి సంఘం నిరాహార దీక్ష



**కరపత్రం ప్రతినిది మహబూబ్‌నగర్, జూలై 2**
రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి ఉద్యమం చేపడతామని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం హెచ్చరించారు. పాలమూరు యూనివర్సిటీలో బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన "ఫీజు రీయింబర్స్‌మెంట్ సాధన దీక్ష"లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆలస్యం వల్ల పేద, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పరీక్షలకు అనుమతించకపోవడం, సర్టిఫికెట్లు నిలిపివేయడం వంటి ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. విద్యపై పెట్టుబడి ఖర్చు కాదని, అది రాష్ట్ర భవిష్యత్తుపై పెట్టుబడని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం అధ్యక్షుడు తాయప్ప మాట్లాడుతూ, విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమానికి అధ్యాపకులు, పరిశోధకులు, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు, సామాజిక సంస్థల ప్రతినిధులు, బీసీ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై సంఘీభావం తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, ఆలస్యం చేస్తే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## తిరుచ్చి ఉప ఎన్నికపై వీడని ఉత్కంఠ

కోలీవుడ్ స్టార్ హీరోయిన్ త్రిష పేరు మరోసారి తమిళనాడు రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఆమె త్వరలో రాజకీయాల్లోకి అడుగుపెడతారని ప్రచారం సాగుతోంది. తిరుచ్చి ఉపఎన్నికలో అధికార పార్టీ తరఫున బరిలో నిలుస్తారా? అనే చర్చలు రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ఈ ప్రచారానికి ప్రధాన కారణం హీరో, కొరియోగ్రాఫర్ రాఘవ లారెన్స్ తీసుకున్న నిర్ణయమే. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ రెండు నియోజకవర్గాల నుంచి పోటీ చేసి రెండింట్లోనూ విజయం సాధించారు. అనంతరం తిరుచ్చి స్థానానికి రాజీనామా చేయడంతో అక్కడ ఉపఎన్నిక అనివార్యమైంది. మొదట ఈ స్థానంలో రాఘవ లారెన్స్ పోటీ చేసే అవకాశాలు ఉన్నాయని విస్తృతంగా ప్రచారం జరిగింది. ఆయన కూడా రాజకీయాల్లోకి రావాలనే ఆసక్తి చూపినట్లు వార్తలు వచ్చాయి. అయితే చివరి నిమిషంలో ఆయన పోటీ నుంచి తప్పుకోవడంతో ఇప్పుడు తిరుచ్చి అభ్యర్థి ఎవరనే అంశం చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో త్రిష పేరు తెరపైకి వచ్చింది. విజయ్‌కు సన్నిహితురాలిగా పేరున్న త్రిషను రాజకీయాల్లోకి తీసుకురావాలనే ఆలోచన ఉందా? ఆమె ఉపఎన్నికలో పోటీ చేసే అవకాశం ఉందా? అనే ఊహాగానాలు తమిళ రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. అయితే ఈ విషయంపై ఇప్పటివరకు త్రిష గానీ, ముఖ్యమంత్రి విజయ్ గానీ ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. దీంతో ప్రస్తుతం జరుగుతున్న ప్రచారం అంతా ఊహాగానాలకే పరిమితమైంది. అయినప్పటికీ త్రిష రాజకీయ అరంగేట్రంపై తమిళనాట ఆసక్తికర చర్చ కొనసాగుతోంది.

# రాయపర్తి చేనేత సంఘం ఎన్నికలకు శ్రీకారం

- మొదటి రోజు 8 నామినేషన్లు దాఖలు
- ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహిస్తాం
- ఎన్నికల అధికారి ఎస్. సందీప్ కుమార్



**కరపత్రం ప్రతినిది నడికూడ, జూలై 2**
నడికూడ మండలం రాయపర్తి చేనేత పారిశ్రామిక సహకార సంఘం లిమిటెడ్ (రిజిస్ట్రేషన్ నెం. టి టి డబ్ల్యూ-80) డైరెక్టర్ల ఎన్నికల ప్రక్రియ గురువారం అధికారికంగా ప్రారంభమైంది. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం తొలి రోజు నామినేషన్ల స్వీకరణ ప్రశాంతంగా కొనసాగగా, మొత్తం ఎనిమిది మంది అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారి ఎస్. సందీప్ కుమార్‌కు సమర్పించారు. గురువారం మొదటి రోజు నామినేషన్లు దాఖలు చేసిన వారిలో ధర్నా భానుచందర్, తుమ్మ గణేష్, కడారి అమరావతి, రాచర్ల సమ్మయ్య, మార్త రాజు, గడ్డం నర్మదా, గాదె మార్కండేయ, అడికిచర్ల పరమేశ్వర్ ఉన్నారు. ఎన్నికల అధికారి వారి నామినేషన్ పత్రాలను స్వీకరించి, ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా తదుపరి పరిశీలన చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి ఎస్. సందీప్ కుమార్ మాట్లాడుతూ.. ఎన్నికల ప్రక్రియను పూర్తిస్థాయి పారదర్శకతతో, నిష్పాక్షికంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేసే ప్రతి అభ్యర్థి నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ఓటరు జాబితాలో పేరున్న సభ్యులకు మాత్రమే ఓటు హక్కుతో పాటు పోటీ చేసే అర్హత ఉంటుందని స్పష్టం చేశారు. రాయపర్తి, నరసక్కపల్లి, పులిగిల్ల, మల్లక్కపేట గ్రామాల పరిధిలోని మొత్తం 195 మంది సభ్యులు ఈ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోనున్నారని తెలిపారు. మొత్తం తొమ్మిది డైరెక్టర్ స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయని, అందులో మహిళలకు రెండు స్థానాలు, జనరల్ కేటగిరీకి ఏడు స్థానాలు కేటాయించినట్లు వెల్లడించారు. జూలై 2, 3, 4 తేదీల్లో నామినేషన్లు స్వీకరిస్తామని, జూలై 5న నామినేషన్ల పరిశీలన, జూలై 6న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుందని తెలిపారు. తుది జాబితాలో తొమ్మిది మంది మాత్రమే ఉంటే ఎన్నికలను ఏకగ్రీవంగా ప్రకటిస్తామని, అంతకంటే ఎక్కువ మంది అభ్యర్థులు ఉంటే జూలై 10న రహస్య బ్యాలెట్ విధానంలో పోలింగ్ నిర్వహిస్తామని వెల్లడించారు.
ఎన్నికల షెడ్యూల్ ప్రకారం మిగిలిన రెండు రోజుల పాటు కూడా నామినేషన్ల స్వీకరణ కొనసాగుతుందని, ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా సభ్యులందరూ సహకరించాలని ఎన్నికల అధికారి ఎస్. సందీప్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

## వరంగల్‌కు అత్యాధునిక నూతన పండ్ల మార్కెట్ నిర్మించాలి

- రైతులకు సౌకర్యవంతమైన మార్కెట్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి రైతు సంఘాల విజ్ఞప్తి
- తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం..
- 20--30 ఎకరాల్లో మార్కెట్, కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేయాలని తీర్మానం



**కరపత్రం ప్రతినిది వరంగల్, జూలై 2**
రాష్ట్రంలో రెండో అతిపెద్ద నగరమైన వరంగల్‌కు రైతులు, వ్యాపారులు, వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా అత్యాధునిక సౌకర్యాలతో కూడిన నూతన పండ్ల మార్కెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం నిర్మించాలని తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో రైతు, ప్రజా సంఘాల నాయకులు, మేధావులు డిమాండ్ చేశారు. వరంగల్ నగరంలోని తెలంగాణ రైతు భవన్‌లో అబ్బనికుంట రైతు భవన్‌లో సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పండ్ల మార్కెట్ నిర్మాణం రైతులకు ఉపయోగపడేలా, భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.
ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, నాలుగేళ్ల క్రితం లక్ష్మీపురం పండ్ల మార్కెట్‌ను కూల్చివేసినప్పటి నుంచి ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో నిర్మాణం చేపట్టకపోవడం వల్ల పండ్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పండించిన పంటను ఎక్కడ విక్రయించాలో తెలియని పరిస్థితి నెలకొనగా, వ్యాపారులు నగరంలోని వివిధ ప్రాంతాల్లో అద్దె దుకాణాలు తీసుకుని వ్యాపారం నిర్వహించాల్సి వస్తోందని పేర్కొన్నారు. ఇప్పటికే సుమారు రూ.9 కోట్ల వ్యయంతో పనులు చేపట్టినా మార్కెట్ నిర్మాణం పూర్తి కాకపోవడం విచారకరమని తెలిపారు. ప్రస్తుతం ఉన్న నాలుగు ఎకరాల స్థలం రిటైల్ విక్రయాలకు మాత్రమే సరిపోతుందని, భారీ స్థాయిలో పండ్ల వ్యాపారం నిర్వహించేందుకు అది ఏమాత్రం అనుకూలం కాదన్నారు. ఇతర జిల్లాలు, పొరుగు రాష్ట్రాల నుంచి కూడా పెద్ద ఎత్తున పండ్లు వరంగల్‌కు చేరుతుండటంతో, నగర శివారులో కనీసం 20 నుంచి 30 ఎకరాల విస్తీర్ణంలో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన పండ్ల మార్కెట్‌ను నిర్మించాలని సూచించారు. రైతులు తీసుకొచ్చే వాహనాల రాకపోకలు, భారీ నిల్వలు, హోల్‌సేల్ వ్యాపారానికి తగిన విధంగా మార్కెట్‌ను అభివృద్ధి చేస్తేనే అది పూర్తి స్థాయిలో రైతులకు ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు.
అదేవిధంగా రైతులు తమ పండ్లను నిల్వ ఉంచుకునేందుకు ప్రభుత్వమే ఆధునిక కోల్డ్ స్టోరేజ్ సౌకర్యాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దీంతో రైతులు గిట్టుబాటు ధర వచ్చే వరకు తమ ఉత్పత్తులను భద్రపరుచుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.
ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ కొంగ వీరస్వామి హాజరయ్యారు. అలాగే ఏఐకేఎంఎస్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి రాచర్ల బాలరాజు, ఏఐకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క మొగిలి, ఏఐకేఎస్ఎస్ జిల్లా కన్వీనర్ వల్లందాస్ కుమార్, ఏఐకేఎస్ జిల్లా కన్వీనర్ సుధమల్ల భాస్కర్, ఓదెల రాజయ్య, సోమ రామ్మూర్తి, నున్న అప్పారావు, కుమార్ గాద్గే, ఊరటి హంసల్ రెడ్డి, సిర్ల రవీందర్, పుచ్చకాయల బుచ్చిరెడ్డి, బొల్లు ఎల్లయ్య, లడే మోహన్‌రావు, బరపాటి రవీందర్ తదితర రైతు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## అన్నా-అక్క మెంటర్‌షిప్‌తో బోధనలో తొలి అడుగు..

- టీచింగ్ ఇంటర్న్‌షిప్ ప్రారంభించిన పింగిళి కళాశాల విద్యార్థినులు
- 462 మంది విద్యార్థినులు 19 ప్రభుత్వ పాఠశాలల్లో సేవలు.. డిజిటల్
- నైపుణ్యాలపై అవగాహన కల్పించనున్న విద్యార్థినులు







**కరపత్రం ప్రతినిది హనుమకొండ, జూలై 2**
తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'అన్నా--అక్క మెంటర్‌షిప్ -- కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్ టీచింగ్ ఇంటర్న్‌షిప్' కార్యక్రమంలో భాగంగా పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి), వడ్డేపల్లి విద్యార్థినులు గురువారం ప్రభుత్వ పాఠశాలల్లో టీచింగ్ ఇంటర్న్‌షిప్‌ను ఉత్సాహంగా ప్రారంభించారు.
కళాశాలకు చెందిన డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న 462 మంది విద్యార్థినులు హనుమకొండ జిల్లాలోని 19 ప్రభుత్వ పాఠశాలలకు కేటాయించబడి, అక్కడి విద్యార్థులకు కృత్రిమ మేధస్సు (ఏఐ), డిజిటల్ అక్షరాస్యత, సాంకేతిక నైపుణ్యాలు, డిజిటల్ లెర్నింగ్ వంటి ఆధునిక అంశాలపై అవగాహన కల్పించనున్నారు.
ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో డిజిటల్ పరిజ్ఞానాన్ని పెంపొందించడంతో పాటు, కళాశాల విద్యార్థినుల్లో బోధనా నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, సేవాభావం వంటి విలువలు మరింత బలోపేతం అవుతాయని కళాశాల యాజమాన్యం పేర్కొంది. విద్యను సమాజంతో అనుసంధానిస్తూ యువతలో సేవా దృక్పథాన్ని పెంపొందించడంలో ఈ కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తుందని అభిప్రాయపడింది.
ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ ప్రొఫెసర్ బి. చంద్రమౌళి మాట్లాడుతూ, విద్యార్థినులు క్రమశిక్షణ, అంకితభావం, బాధ్యతతో ఇంటర్న్‌షిప్‌ను విజయవంతంగా పూర్తి చేసి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ అనుభవం వారి భవిష్యత్ ఉద్యోగ జీవితానికి, వ్యక్తిత్వ వికాసానికి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.
కార్యక్రమాన్ని కళాశాల నోడల్ అధికారులు డా. బి. మాధవి, డా. బి. స్వర్ణలత, డా. పి. రాజిరెడ్డి సమన్వయం చేస్తున్నారు. ఇంటర్న్‌షిప్ విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొని ఇంటర్న్‌షిప్‌కు శుభారంభం పలికారు.

## తెలంగాణ ఉద్యమకారుడు జక్కి అశోక్ కుటుంబానికి చిన్ననాటి మిత్రుల అండ

- రూ.70 వేల ఆర్థిక సహాయం అందజేత..
- స్నేహబంధానికి నిలువెత్తు నిదర్శనం



**కరపత్రం ప్రతినిది వరంగల్, జూలై 02**
వరంగల్ కాశిబుగ్గ 20వ డివిజన్‌కు చెందిన తెలంగాణ ఉద్యమకారుడు జక్కి అశోక్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన మరణంతో కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోగా, చిన్ననాటి మిత్రులు మానవత్వాన్ని చాటుతూ కుటుంబానికి అండగా నిలిచారు. జక్కి అశోక్ చిన్ననాటి స్నేహితులు, క్లాస్‌మేట్లు కలిసి ఆయన కుటుంబ సభ్యులకు రూ.70 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అశోక్ స్నేహానికి, తెలంగాణ ఉద్యమంలో ఆయన చేసిన సేవలకు ఇది తమవంతు నివాళి అని పేర్కొన్నారు. కష్ట సమయంలో కుటుంబానికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.
జక్కి అశోక్ తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొని, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుండేవారని, అలాగే గతంలో కాశిబుగ్గ ప్రాంతంలో ముగ్గురు కార్పొరేటర్ల విజయానికి కీలకంగా కృషి చేసి వారి గెలుపులో ప్రధాన పాత్ర పోషించిన వ్యక్తిగా గుర్తింపు పొందారని పలువురు కొనియాడారు. ఆయన సేవలను మరువలేమని, ఆయన కుటుంబానికి అవసరమైన సహకారం అందించేందుకు తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని తెలిపారు. ఈ ఆర్థిక సహాయ కార్యక్రమంలో చల్లా వేణు, గోరంట్ల మనోహర్, ఓనీ భాస్కర్, పిట్ట గోపి, రంగు రవి, శరత్ రాజు, కేసీ రాజు, టీపీ రామ్, శ్రీనివాస్, రాము తదితర చిన్ననాటి మిత్రులు పాల్గొన్నారు. అలాగే మాజీ కార్పొరేటర్ గుండేటి నరేందర్, ధూపం సంపత్, ఊరుగొండ రవీందర్, గుర్రపు రామకృష్ణ, చిలుపురి సత్యనారాయణ, వేముల నాగరాజు, ఓనీ చక్రపాణి, చిమ్మని గోపి, తోట బాలరాజు, దేవర ప్రసాద్, జంగాలపల్లి రాజు, బొచ్చు మహేష్, చిలువేరు పవన్, ప్రజాప్రతినిధులు, కాశిబుగ్గ మిత్రబృందం సభ్యులు తదితరులు పాల్గొని జక్కి అశోక్ చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కష్టకాలంలో స్నేహితులు చూపిన ఈ మానవత్వం, ఆప్యాయత స్థానికుల ప్రశంసలను అందుకుంది. జక్కి అశోక్ కుటుంబానికి అండగా నిలిచిన మిత్రబృందాన్ని పలువురు అభినందించారు.

## చెక్ బౌన్స్ కేసులకు త్వరిత పరిష్కారం.. జూలై 18న ప్రత్యేక లోక్ అదాలత్

- హనుమకొండ, పర్కాల కోర్టుల్లో ప్రత్యేక బెంచీలు -- కక్షిదారులు అవకాశాన్ని వినియోగించుకోవాలి
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం. రామకృష్ణ సునీత



**కరపత్రం ప్రతినిది బ్యూరో, జూలై 2**
చెక్ బౌన్స్ (నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ యాక్ట్) కేసులను వేగవంతంగా, సామరస్య పూర్వకంగా పరిష్కరించేందుకు ఈ నెల జూలై 18న ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం. రామకృష్ణ సునీత తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక లోక్ అదాలత్‌ను హనుమకొండ జిల్లా కోర్టుతో పాటు పర్కాల కోర్టులో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఇరుపక్షాల పరస్పర అంగీకారంతో కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకునేందుకు ఇది మంచి అవకాశమని, సంబంధిత కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.
హనుమకొండ జిల్లా పరిధిలో ప్రస్తుతం 4,362 చెక్ బౌన్స్ కేసులు ప్రత్యేక లోక్ అదాలత్‌కు గుర్తించినట్లు తెలిపారు. వీటి పరిష్కారం కోసం హనుమకొండలో ఐదు ప్రత్యేక బెంచీలు, పర్కాలలో రెండు బెంచీలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జూలై 18 వరకు ఏ రోజైనా ఇరుపక్షాలు పరస్పర అంగీకారంతో రాజీకి వచ్చి కేసులను పరిష్కరించుకోవచ్చని వివరించారు. లోక్ అదాలత్ ద్వారా తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో శాశ్వత పరిష్కారం లభిస్తుందని, కోర్టు వ్యయంతో పాటు విలువైన సమయం కూడా ఆదా అవుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. ఉచిత న్యాయ సలహాలు లేదా ఇతర వివరాల కోసం జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. ప్రత్యేక లోక్ అదాలత్ విజయవంతం కావడానికి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సహకరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం. రామకృష్ణ సునీత విజ్ఞప్తి చేశారు.

# నిబంధనలు ఉల్లంఘించిన స్కూల్ బస్సులపై కొరడా..



రెండు బస్సులపై కేసులు నమోదు సిరిసిల్ల ఎంవీఐ వంశీధర్

**కరపత్రం ప్రతినిధి, రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో పాఠశాల బస్సుల భద్రతపై రవాణా శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. నిబంధనలు ఉల్లంఘిస్తున్న స్కూల్ బస్సులపై కఠిన చర్యలు చేపడుతూ రెండు బస్సులపై కేసులు నమోదు చేసింది. అవసరమైతే నిబంధనలు పాటించని వాహనాలను సీజ్ చేస్తామని సిరిసిల్ల మోటారు వాహనాల తనిఖీ అధికారి (ఎంవీఐ) వంశీధర్ హెచ్చరించారు. గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఎంవీఐ జిల్లాలోని వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన బస్సులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్ బస్సుల్లో ఫైర్ సేఫ్టీ పరికరాలు, ఫస్ట్ ఎయిడ్ (మెడికల్) కిట్, తాగునీటి సౌకర్యం, డ్రైవర్‌తో పాటు అటెండర్ అందుబాటులో ఉండటం, ఎమర్జెన్సీ డోర్ పనితీరు వంటి భద్రతా ప్రమాణాలను పరిశీలించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని బస్సుల్లో వైపర్లు, రివర్స్ హారన్‌తో పాటు వాహన ఫిట్‌నెస్‌కు సంబంధించిన అన్ని పరికరాలు సక్రమంగా పనిచేసేలా యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని, నిబంధనలు ఉల్లంఘించే వాహనాలపై కేసులు నమోదు చేయడంతో పాటు అవసరమైతే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో నిబంధనలు పాటించని రెండు స్కూల్ బస్సులను గుర్తించి వాటిపై కేసులు నమోదు చేసినట్లు ఎంవీఐ తెలిపారు. జిల్లాలోని అన్ని విద్యాసంస్థల యాజమాన్యాలు భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆయన సూచించారు.

# రోడ్డుపైనే కేబుల్ వైర్లు..




- పట్టించుకోని బల్దియా అధికారులు..
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు..

**కరపత్రం ప్రతినిధి, గోదావరిఖని జూలై 02:**

రామగుండం పారిశ్రామిక ప్రాంతాన్ని సుందరీ కరణ చేస్తున్న తరుణంలో కొన్ని అడ్డంకులు ఎదురవుతున్నాయి. ఎమ్మెల్యే, మేయర్, కార్పొరేషన్ కమిషనర్ సూచనలు కూడా ఎల్లచేయడం లేదు. రోడ్డుపైనే కేబుల్స్ విచ్చలవిడిగా వదిలీయడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. గత వారం రోజులుగా మేదర్ బస్తిలో కేబుల్స్ రోడ్డుపై పడి ఉన్నాయి. అటుపై వెళ్తున్న అధికారులు గానీ, ప్రజా ప్రతినిధులు గాని, స్థానిక కార్పొరేటర్ గాని పట్టించుకోకపోవడంతో ఇక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు, ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా స్థానిక కార్పొరేటర్, మేయర్ స్పందించి ప్రమాదాలకు గురికాకుండా కేబుల్స్ ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

# జీజీహెచ్ లో రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి..

– జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



**కరపత్రం ప్రతినిధి, గోదావరిఖని జూలై 02:**

గోదావరిఖని జనరల్ ఆసుపత్రిలో రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా అన్ని చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం (రామగుండం) గోదావరిఖని జనరల్ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని క్రిటికల్ కేర్ సెంటర్, అన్ని వార్డులు, ఇన్‌పేషెంట్ (ఐపీ) విభాగం, ప్రయోగశాలలు, ఎక్స్‌రే విభాగం, ఆసుపత్రి ప్రాంగణాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, పారిశుద్ధ్య నిర్వహణ, అందుబాటులో ఉన్న సౌకర్యాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ ఆసుపత్రిలో ప్రతిరోజు నిర్వహిస్తున్న ఎక్స్‌రే పరీక్షల నివేదికను జిల్లా కలెక్టర్ కార్యాలయానికి తప్పనిసరిగా సమర్పించాలని ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న లిఫ్ట్‌ను మాన్యువల్ ఆపరేషన్ విధానంలోకి మార్చేందుకు తెలంగాణ స్టేట్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎస్ఎంఎస్ఐడీసీ) ద్వారా చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే ఆసుపత్రిలో కొత్త లిఫ్ట్ ఏర్పాటు చేయాలని, భద్రత దృష్ట్యా ఆరు గ్రిల్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆసుపత్రికి అవసరమైన రెండు ఫ్యూమిగేటర్లు, రెండు కంప్యూటర్లు, రెండు రిఫ్రిజిరేటర్లు, ప్రయోగశాలకు ఐదు యూపీఎస్‌లు, ఒక ప్రింటర్ కొనుగోలు చేసేలా టీఎస్ఎంఎస్ఐడీసీ ద్వారా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆసుపత్రిలో అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను త్వరితగతిన కల్పించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీలో ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ హిమబిందు, ఆర్ఎంఓ కృపా బాయి, వైద్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# హైందవ చైతన్య పరిరక్షణే బీజేపీ ధ్యేయం -- రాష్ట్ర అధ్యక్షుడి ఏడాది పదవీకాలం పూర్తి సందర్భంగా పాలాభిషేకం

**కరపత్రం ప్రతినిధి, జమ్మికుంట, జూలై 2:**

హిందూ ధర్మ పరిరక్షణ, పురాతన దేవాలయాల సంరక్షణ, హైందవ సంస్కృతి వికాసం కోసం భారతీయ జనతా పార్టీ నిరంతరం కృషి చేస్తోందని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పదవీ బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం జమ్మికుంట పట్టణంలోని ప్రసిద్ధ బొమ్మల గుడిలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, పాలాభిషేక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ ధార్మిక సెల్ జిల్లా జాయింట్ కన్వీనర్ బచ్చు శివకుమార్ (శివన్న), ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ మాట్లాడుతూ హిందూ సమాజ ఐక్యత, దేవాలయాల అభివృద్ధి, ఆధ్యాత్మిక విలువల పరిరక్షణకు బీజేపీ ఎల్లప్పుడూ అంకితభావంతో పనిచేస్తోందన్నారు. హిందూ దేవాలయాలు, సంప్రదాయాలపై ఎక్కడైనా దాడులు లేదా అవమానకర ఘటనలు



చోటుచేసుకున్నప్పుడు పార్టీ తరఫున గళమెత్తి స్పందిస్తూ హిందూ సమాజ హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉంటామని తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడి నాయకత్వంలో పార్టీ రాష్ట్రవ్యాప్తంగా బలోపేతమవుతూ ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించుకుందని, హైందవ చైతన్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధితో పాటు సాంస్కృతిక వారసత్వ పరిరక్షణకు కూడా సమాన ప్రాధాన్యత ఇస్తున్న నాయకత్వానికి మద్దతుగా ఈ ప్రత్యేక పూజా కార్యక్రమం చేపట్టినట్లు వెల్లడించారు. అనంతరం దేవాలయంలో ప్రత్యేక



అర్చనలు నిర్వహించి రాష్ట్ర అధ్యక్షుడి ఆయురారోగ్యాలు, పార్టీ మరింత అభివృద్ధి చెందాలని కోరుతూ పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు పార్టీ విజయాలకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కొండ్ల నాగేష్, టంగుటూరి రాజ్‌కుమార్, పొన్నగంటి రవికుమార్, పాకాల రవీందర్ రెడ్డి, ఎంసాని సమ్మయ్య, ఎద్దులాపురం శ్రీనివాస్, సిరియాల విజయ్, చంద సంతోష్, కాశీనాథం, అజయ్, రాము తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అధిక సాంద్రత పత్తి సాగుతో రైతులు అధిక దిగుబడులు సాధించాలి

వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పుల్లూరి స్వప్న సదానందం

**కరపత్రం ప్రతినిధి, జమ్మికుంట, జూలై 2:**

జమ్మికుంట రైతు వేదికలో రైతులకు పత్తి విత్తనాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన పత్తి విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని జమ్మికుంట రైతు వేదికలో వీక్షించారు. అనంతరం అధిక సాంద్రత పత్తి సాగు (హై డెన్సిటీ కాటన్ కల్టివేషన్) లేదా క్లోజర్ స్పేసింగ్ సాగు విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ పద్ధతిని అనుసరించడం ద్వారా తక్కువ విస్తీర్ణంలో



ఎక్కువ మొక్కలను పెంచి అధిక దిగుబడులు సాధించవచ్చని అధికారులు వివరించారు. రైతులు ఆధునిక సాగు పద్ధతులను అవలంబించి వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా అధిక సాంద్రత పత్తి సాగుపై ఆసక్తి కనబరిచిన రైతులకు ప్రత్యేకంగా పత్తి విత్తనాలను పంపిణీ చేశారు. ప్రభుత్వం రైతుల అభివృద్ధికి కట్టుబడి ఉందని, నాణ్యమైన విత్తనాలు,



సాంకేతిక సలహాలు అందుబాటులో ఉంచుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ఖాదర్ హుస్సేన్, ఏఈఓలు ఎగిత అశోక్ తదితర వ్యవసాయ శాఖ సిబ్బంది, మార్కెట్ కమిటీ సిబ్బంది, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు. రైతులు ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు సాధించాలని అధికారులు కోరారు.

# దివ్యాంగ విద్యార్థులకు దుప్పట్లు, టవల్స్ పంపిణీ

గంగిశెట్టి మధురమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం

**కరపత్రం ప్రతినిధి, జమ్మికుంట, జూలై 2:**

సమాజంలోని బలహీన వర్గాలకు అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న గంగిశెట్టి మధురమ్మ ట్రస్ట్ మరోసారి తన సేవాభావాన్ని చాటుకుంది. హుజూరాబాద్ పట్టణానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు గంగిశెట్టి జగదీశ్వర్ తన మాతృమూర్తి జ్ఞాపకార్థం స్థాపించిన గంగిశెట్టి మధురమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో జమ్మికుంట పట్టణంలోని మారుతి నగర్‌లో ఉన్న సాయి ఆశ్రమంలో దివ్యాంగ విద్యార్థులకు అవసరమైన సామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమంలో నివసిస్తున్న 35 మంది దివ్యాంగ విద్యార్థులకు 35 బెడ్ షీట్లు, 35 టవల్స్‌తో పాటు స్వీట్లు, పండ్లు అందజేశారు. విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటించిన ట్రస్ట్ సభ్యులు వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తమ వంతు కృషి కొనసాగుతుందని తెలిపారు. ఈ



సందర్భంగా గంగిశెట్టి జగదీశ్వర్ మాట్లాడుతూ, తన తల్లి మధురమ్మ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ట్రస్ట్ ద్వారా సమాజానికి సేవ చేయడం ఎంతో సంతృప్తిని ఇస్తోందన్నారు. దివ్యాంగ పిల్లలు భగవంతుని స్వరూపాలని, వారికి సహాయం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. మధురమ్మ ట్రస్ట్ ద్వారా గతంలో కూడా అనేక మంది అవసరమైన వారికి సహాయ సహకారాలు అందించామని, భవిష్యత్తులో సాయి ఆశ్రమానికి మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న జగదీశ్వర్ సన్నిహిత మిత్రుడు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఇనుగాల ప్రసాద్ మాట్లాడుతూ, గంగిశెట్టి జగదీశ్వర్



ఎన్నో సంవత్సరాలుగా నిస్వార్థ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఎంతో మందికి చేయూతనందిస్తున్నారని కొనియాడారు. దివ్యాంగ విద్యార్థులకు అవసరమైన వస్తువులను అందించడం అభినందనీయమని, తన వంతు సహకారాన్ని కూడా ఎల్లప్పుడూ అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆశ్రమ వ్యవస్థాపకులు సూత్రపు బుచ్చి రాములు మాట్లాడుతూ, దివ్యాంగ విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని విలువైన సామగ్రిని అందించిన గంగిశెట్టి జగదీశ్వర్, ఇనుగాల ప్రసాద్ మరియు గంగిశెట్టి మధురమ్మ ట్రస్ట్ సభ్యులకు ఆశ్రమం తరఫున, పేరెంట్స్ కమిటీ తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# వీణవంక రోడ్డు ప్రధాన డ్రైన్‌ను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్

వరద నీటి సమస్యకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం -- కమిషనర్ మల్లికార్జున స్వామి

**కరపత్రం ప్రతినిధి, జమ్మికుంట, జూలై 2:**

జమ్మికుంట పట్టణ పరిధిలోని వీణవంక రోడ్డులో వర్షాకాలంలో ఏర్పడుతున్న వరద నీటి సమస్యను పరిష్కరించేందుకు మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ సంబంధిత అధికారులతో కలిసి ప్రధాన డ్రైన్‌ను పరిశీలించారు. ఇటీవల కురుస్తున్న వర్షాల నేపథ్యంలో వరద నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో పక్కనే ఉన్న 24వ వార్డులోకి నీరు చేరి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితిని ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, ప్రస్తుతం ఉన్న డ్రైనేజీ వ్యవస్థ వరద నీటి ప్రవాహాన్ని పూర్తిస్థాయిలో మళ్లించలేకపోతోందని తెలిపారు. దీంతో భారీ వర్షాల సమయంలో నీరు 24వ వార్డులోకి ప్రవేశించి ప్రజలకు అసౌకర్యం కలిగిస్తోందన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం వీణవంక రోడ్డులో కొత్త ప్రధాన డ్రైన్ నిర్మాణం అత్యవసరమని పేర్కొన్నారు. వీణవంక రోడ్డులో నుంచి వచ్చే వరద నీటిని నేరుగా నాయిని చెరువు మత్తడి వరకు మళ్లించే విధంగా సమగ్ర డ్రైనేజీ నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు.



ఇందుకు అవసరమైన నిధుల మంజూరు కోసం త్వరలో జిల్లా కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి ప్రత్యేక నిధులు సాధించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రజలు వర్షాకాలంలో ఇబ్బందులు పడకుండా మౌలిక వసతుల అభివృద్ధికి మున్సిపాలిటీ ప్రాధాన్యత ఇస్తోందని, పట్టణంలోని ప్రతి వార్డులో నీటి నిల్వలు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి చర్యలు కొనసాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని వేగంగా



పరిష్కరించడమే తమ లక్ష్యమన్నారు. డ్రైన్ పరిశీలన సందర్భంగా మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి, టీపీఎస్ రాజ్‌కుమార్, ఏఈ వికాస్, ఆర్ అండ్ బీ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు. సమస్య పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరగా, అందుకు తగిన చర్యలు చేపడతామని అధికారులు హామీ ఇచ్చారు.